ప్రజాశక్తి
బుధవారం 30 ఏప్రిల్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఫ్లోరైడ్ సమస్యకు
చరమగీతం పాడదాం..

- కిడ్నీ భాదితులను ఆదుకోవడానికి సిఎస్ఆర్ నిధులు
- వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయితే ఫ్లోరైడ్ నివారణ
- ప్రెస్‌మీట్‌లో 20 సూత్రాల కార్యక్రమ అమలు ఛైర్మన్ దినకర్



ఛైర్మన్ లంకా దినకర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా అవసరమైన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనతో ఫ్లోరైడ్ సమస్యకు చరమగీతం పాడితేనే వికసిత భారత్, స్వర్ణాంధ్రలో ప్రకాశం జిల్లా భాగస్వామ్యం అవుతుందని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీరు, ఫ్లోరైడ్ సమస్య, యర్రగొండపాలెం ఏస్పిరేషన్ బ్లాక్‌లో కేంద్ర పథకాల అమలు తీరుపై జిల్లా అధికారులతో సమీక్షించామన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టులు అమలుపై ప్రకాశం జిల్లాలో 2024 డిసెంబర్‌లో జిల్లా సమీక్ష అధికారికంగా నిర్వహించి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 22 జిల్లాలు పూర్తి చేశామన్నారు. ప్రకాశం జిల్లాలో ఒక వైపు తాగు, సాగు నీరు ఇబ్బందులుంటే, పశ్చిమ ప్రకాశం జిల్లాలో ఫ్లోరైడ్ తీవ్రత ఎక్కువగా ఉందని తెలిపారు. జిల్లాలో 729 పంచాయతీల లోని 1,769 గ్రామాల్లో 1009 గ్రామాలు ఫ్లోరిడ్ సమస్యతో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఫ్లోరిడ్ సమస్యను ఎదుర్కోవడానికి మొత్తం 27 గ్రామాల్లో సురక్షిత తాగునీటి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. కనిగిరి పరిధిలో అతి ఎక్కువగా 339, దర్శి పరిధిలో 120, మార్కాపురం పరిధిలో 113 గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ▶ 2లో

'యాప్'లతో అగచాట్లు

- పనిచేయని 'బాల సంజీవని 2.0'
- పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం పేరుతో పని ఒత్తిళ్లు
- సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా కొత్త యాప్‌లు



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు వారు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎన్నికల ముందు టీడీపీ హామీలు గుప్పించింది. ప్రభుత్వం కొలువుదీరి 11 నెలలు అవుతున్నా హామీలు అమలు చేయకపోగా కొత్త యాప్ పేరుతో అంగన్‌వాడీలపై పనిభారం పెంచి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. యాప్‌ల నిర్వహణ, సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా అమలు చేయడంతో క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారు. యాప్స్ కారణంగా ఆలస్యంగా వచ్చిన చిన్నారులకు అన్నం పెట్టలేని దుస్థితి దాపురించిందని అంగన్‌వాడీలు ఆందోళన చెందుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నుంచి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రేషన్ సరుకులను మరింత పకడ్బందీగా పంపిణీ చేయాలని ప్రభుత్వం యాప్‌లో మార్పులు, చేర్పులు చేసింది. అప్పటి నుంచి అంగన్‌వాడీలకు కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లు మొబైల్ ఫోన్‌లలో ఇన్‌స్టాల్ కాక అంగన్‌వాడీలు అవస్థలు పడుతున్నారు. యాప్‌ల నిర్వహణలో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరుకులు పంపిణీ చేయాలని ఒత్తిడి చేస్తుండటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తాజాగా బాల సంజీవని 2.0 వెర్షన్‌తో కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లో వర్కర్లు, హెల్పర్లు ఫొటో క్యాప్చర్ చేసి.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో అంగన్‌వాడీలు పోషకాహార పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొత్తగా అమల్లోకి వచ్చిన యాప్ సక్రమంగా పని చేయకపోవడంతో కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో పనిని మూడు యాప్‌లలో వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉండటం, యాప్‌లో సాంకేతిక లోపం కారణంగా పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

హాజరు ఇలా..భోజనం ఎలా..

ప్రతిరోజూ విధిగా ఉదయం 9 గంటలకు, తిరిగి సాయంత్రం 4 గంటలకు ఫేస్ యాప్ వేయాలి. అలాగే వచ్చిన ▶ 2లో

'పాలిసెట్'కు సర్వం సిద్ధం

- 11 కేంద్రాలలో పరీక్ష నిర్వహణ
- హాజరు కానున్న 4 వేల మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్) బుధవారం జరగనుంది. ఈ పరీక్షకు 4 వేల మంది విద్యార్థులు హాజరవుతుండగా, ఒంగోలులో ఏడు, మార్కాపురం నాలుగు పరీక్షా కేంద్రాలను కలిసి మొత్తం 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. 11 గంటల తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చినా విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావాలన్నారు. ఒంగోలులోని ఏడు కేంద్రాల్లో 2,900 మంది, మార్కాపురంలోని నాలుగు కేంద్రాల్లో 1,100 మంది విద్యార్థులను కేటాయించినట్లు తెలిపారు. కేంద్రాల్లో విద్యా ర్థులకు అన్ని వసతులూ కల్పించామన్నారు.

బాపట్ల జిల్లా నుంచి
16 వేల మందిని తరలించాలి

- 'ప్రధానమంత్రి అమరావతి పర్యటన'కు ప్రజలు వెళ్లేందుకు 350 బస్సులు ఏర్పాటు
- కలెక్టర్ వెంకట మురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రధానమంత్రి నరేంద్రమోడీ మే రెండో తేదీ అమరావతి పర్యటన సందర్భంగా హాజరయ్యే ప్రజలను సురక్షితంగా తరలించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులు ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి 16 వేల మంది ప్రజలను అమరావతి కార్యక్రమానికి తరలించడానికి తీసుకోవాలన్నారు. జిల్లా నుండి ప్రజలను తరలించడానికి రవాణా సౌకర్యం కోసం 350 బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. అమరావతి కార్యక్రమానికి వెళ్లే బస్సుల్లో 50 శాతం మంది మహిళలు 50 శాతం పురుషులకు సీట్లు కేటాయించాలని చెప్పారు. ప్రజలను తరలించ డానికి ఏర్పాటుచేసిన బస్సులను 1వ తేదీ రాత్రికి అధికారులు కేటాయించిన ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. గ్రామాల నుండి బస్సులు 2వ తేదీ ఉదయం 9 గంటలకు బయలుదేరే విధంగా అన్ని రకాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు మధ్యాహ్నం 12 గంటలకు అమరావతికి చేరుకోవాలని ఆయన చెప్పారు. అమరావతి కార్యక్రమానికి వచ్చే ప్రజల కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్సుల్లో మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను సహాయకులుగా ఏర్పాటు చేయాలని చెప్పారు. అమరావతి కార్యక్రమానికి తరలి వెళ్లే ప్రజలు తిరిగి వారి గ్రామాలకు వచ్చే వరకు కూడా అధికారులు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. అమరావతి కార్యక్రమానికి వచ్చే ప్రజలకు భోజన సౌకర్యాలు, ▶ 2లో

త్వరలోనే 'ప్రకాశం'లో పర్యటిస్తా..

- రైతుల సమస్యలపై 'పోరు బాట' నిర్వహించాలి
- జిల్లా అధ్యక్షులతో వైసిపి అధినేత జగన్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

త్వరలోనే ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, పొదిలిలో పర్యటిస్తానని మాజీ సిఎం, వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల సమస్యలపై పోరు బాట కార్యక్రమం నిర్వహించాలని, మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రైతుల డిమాండ్ల అమలు కోసం రైతుల తరపున పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. మంగళవారం నాడు ఆ పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షులతో తాడేపల్లిలో ఆయన భేటీ అయ్యారు. జిల్లాల్లో మన నాయకత్వం రైతులకు అండగా నిలిచి భరోసా ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లాల్లో ఏం జరిగినా నాయకత్వం ప్రజల తరపున నిలబడాలన్నారు. ప్రజా వ్యతిరేకత అంశాలపై గట్టిగా పోరాటం చేయాలని సూచించారు. చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, విద్య, వైద్య రంగాల్లో విధ్వంసమే జరిగిందని ఆరోపించారు. ఏడాది లోపే ఈ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఈ అంశాలన్నీ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, జిల్లాల్లో పార్టీ ఓనర్ షిప్ అధ్యక్షులదే అని పేర్కొన్నారు. ప్రజా సంబంధిత విషయాల్లో ఎవరి ఆదేశాల కోసం ఎదురుచూడొద్దన్నారు. ప్రతి సమస్యలోనూ బాధితులకు అండగా నిలవాలని సూచించారు. మే నెలలోపు మండల కమిటీలు పూర్తి చేయాలని, జూన్, జూలై లోపు గ్రామస్థాయి మున్సిపాలిటీల్లో కమిటీలు, అక్టోబర్ లోపు బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మన నాయకత్వ ప్రతిభ తెలుస్తుందన్నారు. సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



గ్యాస్ ఏజెన్సీలో తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

రేషన్, గ్యాస్ ఏజెన్సీల్లో జేసీ ఆకస్మిక తనిఖీ

▶ మెయిన్ 5లో

ఫ్లోరైడ్ సమస్యకు చరమగీతం పాడదాం..

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. నీటిలో పిపిఎం 1.5 లోపు ఉండాలని, కనిగిరి పట్టణంలో అత్యధికంగా 1.98 నుండి 3.19 ఉందన్నారు. కొండపి నియోజకవర్గంలోని మర్రిపూడి మండలం పరిధిలోని నర్సాపురం, కొత్తూరులలో 8, 9 గా, కనిగిరిలోని రేగుమనిపల్లిలో 7 గా ఉందన్నారు. యర్రగొండపాలెంలో 52, కొండపిలో, ఎస్ఎన్ పాడు 25 గ్రామాలు, ఒంగోలులోని ఒక గ్రామంలో ఫ్లోరిడ్ సమస్య ఉందన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు పి4 విధానం ద్వారా డయాలసిస్ సెంటర్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు ద్వారా జిల్లాలో కిడ్నీ బాధితులను ఆదుకోవడానికి సిఎస్ఆర్ నిధులను రాబట్టాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాకు తాగునీరు, ఫ్లోరిడ్ ప్రభావిత ప్రాంతాలలో సహాయం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మానస పుత్రిక పి4 స్ఫూర్తితో కొన్ని ప్రఖ్యాత కేంద్ర ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాపార, సేవా సంస్థలను తీసుకొచ్చామన్నారు. 16 వ ఆర్థిక సంఘం ప్రతినిధులకు ఫ్లోరిడ్ సమస్య ఉన్న ప్రాంతాలకు అదనపు గ్రాంట్ ఇవ్వాల్సిన అవసరం తెలియజేశామన్నారు. కనిగిరి నియోజకవర్గంలో 1.70 నుండి 6.40 మధ్య పిపిఎంతో ఫ్లోరైడ్ సమస్యతో అత్యధిక కిడ్నీ వ్యాధులు వస్తున్నాయన్నారు. కనిగిరి నియోజకవర్గం, కొండపి నియోజకవర్గంలోని మర్రిపూడి మండలంలో 'పూర్తి స్థాయిలో సురక్షిత తాగునీరు' అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం కనిగిరిలో ఒక డయాలిసిస్ సెంటర్‌లో నెలకు 120 మందికి సేవలు అందిస్తున్నారని, ఇంకా ఎన్ని అవసరమో ప్రణాళిక సిద్ధం చేయమని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

ఒంగోలు నగరానికి 4 ఎంఎల్‌డి, మార్కాపురం 3.43, చీమకుర్తి 0.34 ఎంఎల్‌డి తాగునీటి కొరతను అధిగమించే ప్రణాళికలు అధికారులు సిద్ధం చేశారన్నారు. 2025-26 వేసవిలో తాగునీటి ఎద్దడి ఎదుర్కోవడానికి తక్షణ అవసరాల కోసం ఒంగోలు పట్టణానికి రూ.4.4 కోట్లు, జిల్లాలోని మిగతా మున్సిపాల్టీలకు కలిపి 13.92 కోట్ల రూపాయలను మంజూరు చేశామన్నారు. యర్రగొండపాలెంను పిఎం నరేంద్రమోదీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏస్పిరేషన్ బ్లాక్‌గా గుర్తించి ఆరు ముఖ్యమైన సూచీలలో ప్రగతికి మార్గనిర్దేశం చేసిందన్నారు. యర్రగొండపాలెంలో ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలలో గర్భిణుల రక్షణ కోసం రిజిస్ట్రేషన్ 91 శాతం, జనాభాలో మధుమేహం, బిపి పరీక్షలు 81 శాతం, గర్భిణీల కోసం పోషక బలవర్ధక ఆహారం 100 శాతం, వ్యవసాయ సాయిల్ హెల్త్ శాంపిల్ సేకరణ అనంతరం కార్డుల జారీ 45 శాతం, సామాజిక అభివద్ధిలో భాగంగా స్వయం సేవ బందాలకు రివాల్వింగ్ ఫండ్ 60 శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివద్ధి ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు ద్వారా ఏస్పిరేషన్ బ్లాక్ పనితీరును నీతి ఆయోగ్ పర్యవేక్షిస్తుందన్నారు.

రాష్ట్రంలో 51 మండలాలను కరువు మండలాలుగా గుర్తించి నోటిఫికేషన్ ఇవ్వగా, అందులో 37 మండలాల్లో తీవ్ర కరువు ఏర్పడితే అందులో ప్రకాశం జిల్లాలో 11 మండలాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో మిగిలిన 14 కరువు ఛాయలున్న మండలాల్లో ప్రకాశం జిల్లాలో 6 ఉన్నాయన్నారు. జిల్లాలో పుల్లలచెరువు, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి, కంభం, తర్లపాడు, పెద్దారవీడు, సంతనూతలపాడు, ఒంగోలు, వెలిగండ్ల, బేస్తవారిపేటలలో అతి తీవ్ర కరువు ఉందన్నారు. జిల్లాలో కొనకనమిట్ల, మార్కాపురం, చీమకుర్తి, సిఎస్‌పురం, పామూరు, రాచర్ల మండలాల్లో కరువు ఛాయలు ఉన్నాయి. వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తితో పశ్చిమ ప్రకాశం జిల్లా కరువుతో పాటు ఫ్లోరైడ్ సమస్య, కిడ్నీ వ్యాధులు బాధితుల సమస్యను పరిష్కరించడానికి అవకాశం కలుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి డి.వెంకటేశ్వర్లు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'యాప్'లతో అగచాట్లు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే పిల్లల హాజరు ఫొటో తీయాలి. ఎంతమంది హాజరైతే అంత మంది చిన్నారులకు మాత్రమే ఆహారం అందించాల్సి ఉంది. మూడేళ్ల లోపు చిన్నారులు కావడంతో జిల్లాలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉదయం 10.30 గంటల వరకు పిల్లలు వస్తూనే ఉంటారు. ముందుగానే యాప్ నమోదు చేసిన కారణంగా తర్వాత వచ్చిన పిల్లలకు ఆహారం అందించేందుకు అవకాశం లేకపోవడంతో వండిన ఆహారాన్నే అందరికి సరిపెట్టాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ సమస్యను అధికారుల ద్వారా ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

అంగన్‌వాడీ సేవలు ఇలా..

చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను ప్రవేశపెట్టింది. జిల్లాలోని 13 ప్రాజెక్టుల పరిధిలో 2903 మెయిన్, 227 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందుకు గానూ అంగన్‌వాడీ కార్యకర్తలు 2596 మంది, ఆయాలు 2548 మంది, మినీ కార్యకర్తలు 227 మంది విధులు నిర్వహిస్తున్నారు. అన్ని కేంద్రాల్లో కలిపి 3.50 లక్షలు మంది చిన్నారులు ఉన్నారు. అంగన్‌వాడీ టీచరు నెలకు రూ.11,500, హెల్పర్‌కు, మినీ వర్కర్‌కు రూ.7 వేలు చొప్పున వేతనంగా ఇస్తున్నారు.

వేతనాల్లో కోత..

అంగన్‌వాడీ కార్యకర్తల వేతనానికి ఫేస్ యాప్‌తో ముడిపెట్టారు. ఫేస్ యాప్ వేసిన రోజుకు మాత్రమే వేతనం వస్తోంది. సాంకేతిక సమస్య తలెత్తి ఆ రోజు యాప్‌లో నమోదు కాకపోతే వేతనం కట్ అవుతోంది. ప్రభుత్వం కోరిన సమాచారాన్ని యాప్‌ల ద్వారా ఇవ్వడం, రికార్డులు రాయడం, టేక్ హోం రేషన్ పంపిణీ, ప్రతి నెలా 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పిల్లల బరువు పరిశీలించడం వంటి విధులు నిర్వహిస్తున్నారు. ఇవే కాకుండా ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కావాలని తమపై పని భారం మోపుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెలా రూ.11,500 గౌరవ వేతనంతో నెలంతా తమతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని మండిపడుతున్నారు. కేంద్రాలను శుభ్రం చేయడం, ప్రీ స్కూల్ విద్యార్థులకు పోషకాహారం వండి పెట్టడం, వంటపాత్రలు కడగటం, పిల్లల వాష్ రూం శుభ్రం చేయడం వంటి పనులు చేస్తున్న వారికి నెలకు కేవలం రూ.7 వేలు మాత్రమే ఇస్తున్నారు.

పనిచేయని ఫోన్‌లతో ఇబ్బందులు

వై సత్యవతి, అధ్యక్షురాలు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన బాలసంజీవని యాప్ సక్రమంగా పని చేయడం లేదు. ప్రస్తుతం ఉన్న ఫోన్‌లలో యాప్ ఇన్‌స్టాల్ అయినా సర్వర్లు మొరాయిస్తుండటంతో వివరాలు నమోదు చేసేందుకు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం అంతంత మాత్రంగానే ఉంది. నెట్ లేకపోతే యాప్ ఓపెన్ కావడం లేదు.

ట్యాబ్‌ల పంపిణీ చేయాలి

ఈదర అన్నపూర్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

బాలసంజీవని 2.0 యాప్‌తో అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇచ్చిన మొబైల్ ఫోన్‌లలో ఈ యాప్ పని చేయడం లేదు. పాత ఫోన్‌లను వెనక్కు తీసుకొని ఆ స్థానంలో 5జీ ట్యాబ్‌లు పంపిణీ చేసి.. అంగన్‌వాడీలకు యాప్ కష్టాలు తొలగించాలి. యాప్స నిర్వహణతో ఆంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీలు పడుతున్న అవస్థలు తొలగించాలి.

పని భారం తగ్గించాలి

డికెఎం రఫీ, సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలపై పని భారం అధికమైంది. కేంద్రాల్లో యాప్స నిర్వహణతో సతమతమవుతున్నారు. పనులే కాకుండా ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కావాలని ఒత్తిళ్లు చేస్తున్నారు. అరకొర వేతనం ఇస్తూ అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ చేయించడం సరికాదు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వారిపై పనిభారం తగ్గించకుంటే రాబోయే రోజుల్లో ఆందోళనలు చేపడతాం..

16 వేల మందిని తరలించాలి..

(మొదటిపేజీ తరువాయి)

తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి కార్యక్రమానికి వెళ్లే ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వెళ్లే మార్గాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సమాచారాన్ని తెలుసుకోవాలని అధికారులకు చెప్పారు. జిల్లా నుంచి ప్రధాన మంత్రి పర్యటనకు వెళ్లే వాహనాలు గుంటూరు కాజా టోల్ ప్లాజా మీదుగా వెస్ట్ బైపాస్, కొండవీటివాగు, వెలగపూడి పార్కింగ్ ప్రదేశానికి వెళ్లాలన్నారు. జిల్లాలో మే 1న పెన్షన్లు పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ నెల 30వ తేదీన పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ సొమ్మును బ్యాంకులో డ్రా చేసుకొని భద్రపరుచుకోవాలన్నారు. పెన్షన్ల పంపిణీలో లోటు పాట్లకు తావు లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్, జిల్లా రిజిస్ట్రార్ సాయితేజ, జిల్లా పౌరసరఫరాల అధికారి విలియమ్స్, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామరెడ్డి పాల్గొన్నారు.

పుల్లలచెరువు తహశీల్దారుగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండల కేంద్రంలో నూతన తహశీల్దారుగా కె వెంకటేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పొన్నలూరు డీటీగా పనిచేస్తూ పదోన్నతిపై పుల్లలచెరువు తహశీల్దారుగా వచ్చారు. ఈ సందర్భంగా నూతన తహశీల్దారును తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, ఆర్యవైశ్య నాయకులు గజ్వల్లి భాస్కర్‌రావు, కే ఆంజనేయులు జనసేన పార్టీ నాయకుడు డి వెంకటేశ్వరరావు తదితరులు కలిసి అభినందించారు.



కందుల వెంకట తేజారెడ్డి అభినందిస్తున్న జింక చంద్రశేఖర్

అరుణోదయ విద్యార్థికి వాస్కులర్ సర్జరీలో మాస్టర్స్ డిగ్రీ

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని అరుణోదయ స్కూల్ పూర్వ విద్యార్థి కందుల వెంకట తేజారెడ్డి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన న్యూఢిల్లీలోని గురుగావ్ శ్రీ వేదాంత మెడిసిటీ యూనివర్సిటీలో వాస్కులర్ సర్జరీ మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి కందుల వెంకట తేజారెడ్డిని అరుణోదయ కరస్పాండెంట్ జింక చంద్రశేఖర్ సత్కరించి అభినందనలు తెలిపారు. చిన్ననాటి నుంచి అత్యున్నత ప్రమాణాలు కలిగిన విద్యాసంస్థల్లో తమ పిల్లలను చేర్చి తగిన ప్రోత్సాహాన్ని అందించి గొప్ప వైద్యునిగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులు కందుల వెంకటరమణారెడ్డి, పిడతల సుభాషిణిలను చంద్రశేఖర్ ప్రశంసించారు. విద్యార్థి వెంకట తేజారెడ్డి మాట్లాడుతూ మా చిన్నప్పటి నుంచి అత్యున్నత విద్యా ప్రమాణాలతో విద్యాబుద్ధులు నేర్పిన తన ఎదుగుదలకు కృషి చేసిన అరుణోదయ స్కూల్ యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల విద్యలో మార్పులను తక్షణమే ఆపాలి

ఎస్ఎఫ్ఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పాఠశాల విద్యలో ప్రభుత్వం తలపెట్టిన మార్పులు తక్షణమే నిలిపి వేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేసారు. మంగళవారం నాడు స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఎస్ఎఫ్ఐ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వినోద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసంబద్ధమైన 117 జీవో రద్దు చేయాలని, దాని స్థానంలో మార్పులతో తెచ్చిన నూతన విధానం కూడా అసంబద్ధంగానే ఉన్నదని దీనిని కూడా తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రాథమిక విద్యను బలహీనం చేసే ప్రక్రియను నిలిపివేయాలని, ఎలిమెంటరీ స్కూళ్లను రెండు భాగాలుగా విడదీయాలనే ఆలోచన మానుకోవాలని హితవు పలికారు. సీబీఎస్ఈ సిలబస్ కాకుండా స్టేట్ సిలబస్ అమలు చేయాలని కోరారు. ప్రతి క్లాస్‌కు ఒక టీచర్ ఉండేలా, ఏకోపాధ్యాయ పాఠశాలలను గుర్తించి అదనంగా టీచర్‌ను కేటాయించాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ పేదలను, వెనకబడిన ప్రాంత ప్రజలకు ప్రభుత్వ విద్యను దూరం చేసే విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని కోరారు. వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివద్ధికి ఈ నిర్ణయాలు నష్టదాయక ఫలితాలు ఇస్తాయని తెలిపారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ 10 ప్లస్ 2 పాఠశాలల అభివృద్ధికి సరైన ప్రణాళిక ఉండాలని, ప్రభుత్వం దృష్టి సారించి ఈ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్లస్ టు కు ప్రత్యేక ప్రిన్సిపాల్‌ను కేటాయించాలని కోరారు. పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు యల్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య ను కాపాడుకోవడం కోసం అందరం కలిసి పోరాటాలు నిర్వహించాలన్నారు. యుటిఎఫ్ సహ అధ్యక్షురాలు ఉమామహేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చే మార్పులు వలన బాలికలు చదువుకు దూరం అవుతారని, నిరక్షరాస్యత పెరుగుతుందని వీటిపై సమగ్రమైన చర్చ జరగాలని కోరారు. సమావేశంలో అసంబద్ధమైన 117 జీవోను, దానికి సవరణ పేరుతో చేస్తున్న మార్పులను తక్షణమే నిలిపివేయాలని, 8 రకాల స్కూలు ఆమోదంపై సమగ్రమైన అభిప్రాయ సేకరణ జరగాలని, గ్రామ సభల్లో ఆమోదం పొందాలని, 10 ప్లస్ 2 పాఠశాల అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళిక ఉండాలని దానికి ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. సవరణ పేరుతో ఏ స్కూలు మూత వేయకూడదని కోరారు. స్కూలు రక్షణ కోసం ఉద్యమాన్ని చేపట్టాలని తీర్మానాలు చేసారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరాస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.విజయ్, పాండురంగారావు, జిల్లా నాయకులు దేవా, విజయ్, తేజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాల్ రెడ్డి

'నీట్' పరీక్ష ప్రశాంతంగా నిర్వహించాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాలు

పరీక్షకు హాజరు కానున్న 1473 అభ్యర్థులు

ఒంగోలులో ఐదు కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో మే 4న జరగనున్న నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 4న ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ పరీక్షకు మొత్తం 1473 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఒంగోలు నగరంలోని కేంద్రీయ విద్యాలయ, జవహర్ నవోదయ, దామదర్ల సక్కుబాయమ్మ మహిళా డిగ్రీ కాలేజి, దామదర్ల ఆంజనేయులు పాలిటెక్నిక్ కళాశాల, డిఆర్ఆర్ మున్సిపల్ స్కూల్‌లను కేంద్రాలుగా ఎన్‌టిఎ ఎంపిక చేసిందన్నారు. ఈ 5 కేంద్రాలలో పరీక్షలు సజావుగా జరిగేందుకు భద్రతా పరమైన చర్యలతో పాటు అభ్యర్థులకు అవసరమైన రవాణా సౌకర్యం, పరీక్షా కేంద్రాలో తాగునీరు, వైద్య శిబిరం, విద్యుత్, పారిశుధ్యం, వికలాంగులకు వీల్ చైర్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. భద్రత, ప్రశ్నాపత్రాల ఓపెనింగ్, అభ్యర్థుల తనిఖీలు వంటి విషయాలలో ఎన్‌టిఎ మార్గదర్శకాలను ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇన్విజిలేటర్లకు అవసరమైన శిక్షణ గురువారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరీక్షల సిటీ కో-ఆర్డినేటర్‌కు ఆమె సూచించారు. అభ్యర్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసే వాతావరణాన్ని కల్పించే బాధ్యత ఆయా సెంటర్ల సూపరింటెండెంట్లపై ఉందన్నారు. సమావేశంలో ఏఎస్‌పి కె.నాగేశ్వర రావు, డిఆర్ఒ బి.చిన ఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టరు సహదిత్ వెంకట త్రివినాగ్, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మి ప్రసన్న, డిపిఒ జి.వెంకట నాయుడు, డిఈఒ ఏ.కిరణ్ కుమార్, సిటీ కో-ఆర్డినేటర్, ఎన్‌టిఎ నోడల్ ఆఫీసర్ మనీష్ కుమార్, సెంటర్ సూపరింటెండెంట్లు, విద్యుత్, మున్సిపల్, వైద్య, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



పెట్రోల్ బంక్ తనిఖీ చేస్తున్న డిటి వెంకటేశ్వర్లు, ఫైర్ అధికారి జాలయ్య

పెట్రోలు బంకుల్లో తనిఖీ

ప్రజాశక్తి-దర్శి

పెట్రోల్ బంకుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని స్థానిక డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఫైర్‌స్టేషన్ అధికారి మరియు ఆర్ఐ పరిటాలశ్రీనివాసరావుతో కలిసి పెట్రోల్ బంకు తనిఖీ చేశారు. కొలతలు సక్రంగా ఇవ్వాలని, నాణ్యమైన పెట్రోల్ వినియోగదానికి ఇవ్వాలని బంకు యజమాని దేవతి వరప్రసాద్‌ను కోరారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వినియోగదారులకు కనీసక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా గ్యాస్ గూడెం కూడా తనిఖీ చేశారు. గ్యాస్ గూడెంలో తగు జాగ్రత్తలు చేపట్టాలని యజమాని అంజయ్యను ఆదేశించారు.

అందరికీ అందని వేట నిషేధకాల భృతి

మత్స్యశాఖ అధికారికి వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ఇతర కులాలకు చెంది పూర్వకాలం నుంచి మత్స్యకారులుగా జీవనం సాగిస్తున్న వారికి వేట నిషేధకాల భృతి అందకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు చీరాల వాడరేవు మత్స్యకారులు జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్ నాయక్‌ను మంగళవారం కలసి వినతిపత్రం అందజేశారు. తామంతా ప్రభుత్వం నిర్ధేశించిన నియమ నిబంధనల ప్రకారం సముద్రంలో చేపలు పొదుగు కాలమైన ఏప్రిల్ 15 నుంచి జూన్ 16వ తేదీ వరకు 61 రోజుల పాటు సముద్రంలో వేట వెళ్లమని చెప్పారు. తమ పేర్లు జాబితాలో ఉన్నప్పటికీ నిషేధ కాల భృతి అందలేదని ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. తమకు ప్రభుత్వం ఇస్తున్న రూ.20 వేలు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెల 26వ తేదీన జిల్లాలోని నిజాంపట్నం మండలం కొత్తపాలెం గ్రామంలో మత్స్యకారుల వేట నిషేధ కాల భృతిని అందజేశారు. జిల్లాలో మత్స్యకారులుగా ఉన్న 12,671 మందికి రూ.25.34 లక్షలను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు రేపల్లె నియోజకవర్గంలో 7,304 మందికి, బాపట్లలో 1,441 మంది, చీరాలలో 2,836, పర్చూరులో 1,090 మందికి రూ.20 వేల వంతున పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ బిసి వర్గాలకు చెందిన పల్లెకారులుగా ఉన్న వారికే వేట నిషేధకాల భృతి అందింది. కాని తాతల కాలం నుంచి చేపల వేటే జీవనాధారంగా ఉన్న రెడ్డి, కాపు, కమ్మ వర్గాలకు చెందిన వారికి నిషేధకాల భృతి జమ కాలేదు. వీరు ఓసి వర్గాలకు చెందిన వారు అయినప్పటికీ సముద్రంలో వేటే జీవనాధారంగా ఉన్నారు. వీరందరికి బోటు లైసెన్స్‌లు, ప్రభుత్వం వీరిని మత్స్యకారులుగా గుర్తిస్తూ ఇచ్చిన గుర్తింపు పత్రాలు ఉన్నాయి. వేట నిషేధకాల భృతి కోసం ఎంపిక చేసిన జాబితాలో తమ పేర్లు కూడా చెబుతున్నారు. కాని పల్లెకారులు మినహా మత్స్యకారులుగా ఉన్న మిగతా కులాల వారు ఎవరికి నిషేధకాల భృతి సొమ్ము జమ కాలేదు. ఇలా జిల్లాలో 300 మంది వరకు ఉన్నట్లు చెబుతున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వాడరేవు మత్స్యకారులు

ఇందిరా కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వినోద్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఫీజులు చెల్లించలేదని విద్యార్థులపై ఒత్తిడి తెచ్చిన మార్కాపురం ఇందిరా ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వినోద్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. ఫీజులు చెల్లించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వందేనిని విద్యార్థులను ఈ విషయంలో ఒత్తిడికి గురి చేస్తే ఆ విద్యాసంస్థపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అంశాన్ని గుర్తు చేసారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను మార్కాపురం ఇందిరా ఇంజనీరింగ్ కాలేజీ ఖాతారు చేయకుండా విద్యార్థులే ఫీజులు చెల్లించాలని ప్రభుత్వంతో మాకు సంబంధం లేదని, హాల్ టికెట్లు ఇవ్వకుండా మానసిక వేదనకు గురి చేస్తున్న వైనం మీడియా ద్వారా బయటకు వచ్చిందని తెలిపారు. హాల్ టికెట్లు సమయానికి ఇవ్వలేదని, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అదనంగా వసూలు చేస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారని చెప్పారు. జిల్లా అధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకొని ఆ కాలేజీ పై సమగ్ర విచారణ జరపాలని ఫీజుల విషయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న విద్యాసంస్థల యొక్క గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కో-చైర్మన్‌గా ప్రకాష్ బాబు

అభినందించిన అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



నియామకపత్రం అందుకుంటున్న ప్రకాశ్ బాబు

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీని పర్యవేక్షించే ఉన్నత స్థాయి రాష్ట్ర కౌన్సిల్ కో - చైర్మన్‌గా జిల్లా వాసి, రాష్ట్ర నాయకులు, మాంటిస్సోరి అధినేత పి.ప్రకాష్ బాబు ఎన్నికయ్యారు. కౌన్సిల్ చైర్మన్ కొమరగిరి చంద్రశేఖర రావు, రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్య రాజు చేతులమీదుగా నియమకపత్రాన్ని అయన ఆందుకున్నారు. ఈ సందర్భంగా ఎపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు గేరా అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక సర్వసభ్య సమావేశంలో మాంటిస్సోరి ప్రకాష్ బాబును రాష్ట్ర కౌన్సిల్ కో-చైర్మన్‌గా నియమించారన్నారు. రాబోయే రోజులలో ప్రకాష్ బాబు నాయకత్వంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ శాఖలు సమర్ధవంతంగా పనిచేసి, అసోసియేషన్‌ను పటిష్టం చేస్తామని తెలియజేశారు. రాష్ట్రంలోనే సీనియర్ నాయకులైన పి. ప్రకాష్ బాబు ఎ. పి. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కో-చైర్మన్‌గా నియమించటం పట్ల జిల్లాలోని అసోసియేషన్ నాయకులు, ప్రైవేట్ స్కూల్స్ కరెస్పాండెంట్‌లు, స్కూల్స్ డైరెక్టర్‌లు, స్కూల్స్ ప్రిన్సిపాల్స్ హర్షం వ్యక్తం చేశారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.శివకోటి రెడ్డి, ఒంగోలు పట్టణ అధ్యక్షురాలు ఈ.వి.ఎస్. లక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు. మాంటిస్సోరి పి.ప్రకాష్ బాబును అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షులు బొమ్మల శ్రీనివాసరావు, ఆత్మకూరి బ్రహ్మయ్య, వివి రమణ, జయ కుమార్, పిడుగు జాలిరెడ్డి, జిల్లా నాయకులు ఈపూరి శివప్రసాద్, ఇండ్ల ఏసుపాదం, డ్రీమ్స్ శ్రీను, సిబి మైఖెల్, సర్దార్, చీమకుర్తి యూనిట్ స్కూల్స్ ప్రతినిధులు అభినందించారు.

ఏసీ రిపేర్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలలోని రూడ్‌సెట్ సంస్థలో ఈ నెల 21 నుంచి 30 రోజుల పాటు ఏసీ రిపేర్, ఫ్రిడ్జ్ రిపేర్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ఒంగోలు జిల్లా గ్రామీణ ప్రాంతాలకూ చెంది ఉండి ఆధార్ కార్డ్, మరియు రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణా కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పించబడునని తెలిపారు. మరిన్ని వివరాలకు 8309915577 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ కె అనిత

'అనిత హాస్పిటల్' వైద్య సేవలు

ప్రజాశక్తి - చీరాల

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే సేవా భావంతో వైద్య సేవలను అందించటమే అనిత హాస్పిటల్ వైద్యుల లక్ష్యమని డాక్టర్ కె అనిత అన్నారు. వాడరేవు సమీపంలోని అడవిపల్లిపాలెం పంచాయితీ కృపానగర్‌లో అనిత హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హాస్పిటల్ నుండి పలువురు వైద్యులు హాజరై ఆ గ్రామంలోని సుమారు 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో పలువురికి జనరల్ మెడిసిన్, ఆర్థో, గైనకాలజిస్ట్, డెంటల్, గ్యాస్ట్రో సంబంధిత వ్యాధులకు వైద్యులు చికిత్స నిర్వహించారు. అనిత హాస్పిటల్ డాక్టర్ అనిత మాట్లాడుతూ ఉచిత మెడికల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. అత్యవసర వైద్య సేవలకు గుంటూరు, విజయవాడ వంటి దూర ప్రాంతాలకు వెళ్లకుండా చీరాలలో నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో అత్యాధునిక పరికరాలతో చీరాల పట్టా భిరామ స్వీట్స్ వద్ద హాస్పిటల్ నిర్మించామని అన్నారు. తమ హాస్పిటల్లో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. జీర్ణకోశ లేపరోస్కోపిక్, జనరల్ సర్జరీ డాక్టర్ ఎం బాలాజీ, డెంటల్ వైద్యులు డాక్టర్ కె అనుజ, ఇతర వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఇటువంటి మరెన్నో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్యసేవలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో అనిత హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలి

ప్రజాశక్తి - బట్టిప్రోలు

అమరావతి రాజధాని పునః నిర్మాణ పనులు ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు అధికారులకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపిడిఒలు, ఎపిఎంలు, మండల స్థాయి అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 2న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు నియోజకవర్గం నుంచి విచ్చేసే మహిళలు, ప్రజలు తిరిగి గమ్యస్థానాలకు వెళ్లేవరకు త్రాగునీరు, ఆహారం, వాహనాలు వంటి సౌకర్యాలు మండల, గ్రామ స్థాయి అధికారులు సమన్వయంతో ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో భట్టిప్రోలు, అమృతలూరు, వేమూరు, కొల్లూరు, చుండూరు మండలాల ఎంపిడిఒలు ఎస్ వెంకట రమణ, మారుతి శేషమాంబ, సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ బుధవారం శంకుస్థాపన చేస్తారని మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధి తెలిపారు. సింగరకొండ రోడ్డులోని అగ్నిమాపక శాఖ భవన నిర్మాణ శంకుస్థాపన, విద్యుత్ సబ్‌స్టేషన్ ఎన్ఎస్పి కార్యాలయ ఆవరణలో జరుగుతుందని తెలిపారు. మే 2న అమరావతి పునః నిర్మాణ ప్రారంభ వేడుక సందర్భంగా నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్ఎస్పి కార్యాలయ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని తెలిపారు.

రఘురామరాజు వ్యాఖ్యలను ఖండించండి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుపై ఉప సభాపతి రఘు రామ రాజు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి జి సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడా రు. ఉండి నియోజకవర్గంలో కాలువ కట్టల వెంబడి నివసిస్తున్న పేదల ఇళ్లను కూల్చి వారిని నిరాశ్రయులను చేసిన విషయంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివా సరావు ఆ ప్రాంతాన్ని సందర్శించారని అన్నారు. ఆ పేదల కు ధైర్యం నింపి నిరాశ్రయులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నివేశ స్థలాలు కేటాయించి ఇల్లు కట్టించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారని అన్నారు. ఉండి ఎమ్మెల్యే, ఉప సభాపతి రఘు రామకృష్ణమ రాజు భూస్వాములకు తొత్తులుగా మారి పేదల ఇళ్లను కుతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు అడ్డుగా ఉన్నారని, కాలుష్యం సాకుతో పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని ఖండించారు. బేషరతుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధిగా ఉపసభాపతిగా హుందాగా వ్యవహరించాల్సిన రఘురామకృష్ణంరాజు అసభ్య పదజాలంతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుపై వ్యక్తిగత దూషణ చేయడం గౌరవాన్ని తగ్గించడమేనని అన్నారు. రాఘురామరాజు ఆ పదవికి అనర్హుడని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంపై స్పందించాలని, ఉప సభాపతి నుండి ఆయనను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్ళను కూల్చివేయడం రఘురామరాజు వ్యక్తిగతమా లేదా కూటమి ప్రభుత్వ విధానమా అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఎప్పుడు ప్రజల పక్షాన నిలబడుతుందని అన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటుందని, ప్రభుత్వ భూముల్లో ఇళ్ళు వేసుకుని నివాసం ఉంటున్న వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల సందర్భంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మురుగుడు సత్యనారాయణ, పి మనోజ్ కుమార్, దీపాల సత్యనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి జి సుధాకర్

ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టాలి

అధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్


ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి రవికుమార్

ప్రజాశక్తి - అద్దంకి

జల వనరుల శాఖ అధికారులు, రైతులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఐడీసీ)కి సంబంధించిన అంశాలపై చర్చించారు. రైతుల సలహాలు స్వీకరించారు. ఎత్తిపోతల పథకాలు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న వ్యవసాయ సీజన్‌కు రైతులకు ఇబ్బందులు లేకుండా కాలువల మరమత్తులు, ఇతర పనులు పూర్తి చేయాలని చెప్పారు. తిమ్మాయిపాలెం, కామేపల్లి, తంగేడుమిల్లి, కోటావారిపాలెం, కొణిదిన, గుంటుపల్లి ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాల పనులు వెంటనే ప్రారంభించాలని చెప్పారు. ఉప్పలపాడు, తమ్మవరంలో అసంపూర్తిగా ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఎత్తిపోతల పథకాలకు సంబంధించి నిధుల కొరత లేకుండా చేస్తామని చెప్పారు.

బాపట్ల : ఎత్తిపోతల పథకాలకు వెంటనే మరమ్మత్తులు చేసి రైతుల సాగునీటి అవసరాలు తీర్చాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను పూర్తిగా విస్మరించి రైతులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు సాగునీటి అవసరాలు తీర్చడానికి అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగించుకోవాలని అన్నారు. ఆక్రమణలకు గురైన ఎత్తిపోతల పథకాలకు చెందిన భూముల సర్వే నిర్వహించి స్వాధీనం చేసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎపిఎస్ఐడిసి ఈఈ బాగ్యలక్ష్మి, డిఈఈ సిరాజ్ అహ్మద్, వేగేశన కిషోర్ రాజు, టిడిపి మాజీ అధ్యక్షులు కావూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


ఎపిఎస్ఐడిసి అధికారుల సమావేశంలో నరేంద్ర వర్మ

వేతనాల కోసం సిహెచ్‌ఒల నిరసన

ప్రజాశక్తి - బాపట్ల

వైద్య ఆరోగ్య శాఖ ఎన్‌హెచ్‌ఎంలో సామాజిక ఆరోగ్య అధికారులగా పనిచేస్తున్న సిహెచ్‌ఓలకు రెండేళ్లుగా వేతనాలు చెల్లించాలని కోరుతూ వైద్య ఆరోగ్య జిల్లా అధికారి కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఓల సంఘం జిల్లా నాయకులు వీర ప్రతాప్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుత నిరసనలో భాగంగా డిఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదురు నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆరేళ్ళుగా సిహెచ్‌ఓలుగా పనిచేస్తున్న తమ సర్వీసును క్రమబద్ధికరించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎంలో ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని అన్నారు. ప్రతి నెల జీతం తోపాటు ప్రోత్సాహకం ఇవ్వాలని కోరారు. ప్రతి ఏటా 5శాతం జీవితం పెంపుదల ఇవ్వాలని అన్నారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు తీర్చే విధంగా హామీ ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్ల పరిష్కారం అయ్యే వరకు శాంతియుత నిరసన కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు త్రినయని, ఎస్ఎన్ రాజు, రాజాకృపానిధి, రత్నకుమారి, సిహెచ్‌ఓలు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న సిహెచ్‌ఓలు


రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వీల్ చైర్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

వీల్‌చైర్స్ బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ అద్దంకి ఆధ్వర్యంలో హైదరాబాద్ జూబ్లిహిల్స్ రోటరీ క్లబ్, షార్ ప్రాజెక్ట్స్, పిడుగురాళ్ల లైమ్ సిటీ రోటరీ క్లబ్ ఆర్థిక సౌజన్యంతో ఆరు గురు విభిన్న ప్రతిభావంతులకు రూ.60వేల విలువైన ఆరు వీల్ చైర్స్‌ను వారి ఇళ్ల వద్దనే పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ డాక్టర్ కె శరత్ చౌదరి, జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బాలకోటిరెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ విష్ణుబాబు, రోటరీ క్లబ్ సింగరకొండ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ఎజి షేక్ మహమ్మద్ రఫీ, చిన్ని మురళీ కృష్ణ, డాక్టర్ దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, అళహరి హరిప్రసాద్, అద్దంకి లేవి ప్రసాద్, అన్నంగి సుబ్బారావు, పిఎల్‌వి నరసింహారావు, నర్రా శ్రీలక్ష్మీ, జాగర్లమూడి శివకుమారి, కొల్లా భువనేశ్వరి పాల్గొన్నారు.

వేటపాలెం : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్, పిడుగురాళ్ల రోటరీ క్లబ్ సహకారంతో అంగవైకల్యం ఉన్న పిల్లలకు వీల్‌చైర్లను రోటరీ జిల్లా గవర్నర్ కె శరత్ చౌదరి, బాలకోటిరెడ్డి, విష్ణు బాబు చేతుల మీదుగా నలుగురికి మంగళవారం అందజేశారు. తాము ఇచ్చిన వీల్‌చైర్లను తల్లిదండ్రుల సహకారంతో ఉపయోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు ఎవి సురేష్ బాబు, వి లక్ష్మణస్వామి, చాప్టర్ ప్రెసిడెంట్ గొల్లపూడి సీతారాం, కొత్త శ్రీనివాసరావు, బట్ట మోహనరావు, అక్కల చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

వేసవి దృష్ట్యా అంగన్‌వాడి కేంద్రాల్లో పరిశుభ్రమైన త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రాధా మాధవి తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంను ఆమె మంగళవారం సందర్శించారు. ప్రతి 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రలో భాగంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రీస్కూల్ పిల్లలను చేర్చుకోవడానికి కమ్యూనిటీని మోటివేట్ చేయాలని అన్నారు. పోషణ లోపం ఉన్న పిల్లల రికార్డు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. పిల్లల ఆహారపు అలవాట్లు చిన్నప్పటి నుండి మంచిగా ఉండేటట్లు చూసుకోవాలని అన్నారు. జింక్ ఫుడ్‌కు వీలైనంత దూరంగా ఉంచాలని అన్నారు. సొంత భవనాలు లేని అంగన్‌వాడి సెంటర్లకు స్థలం ఉంటే భవన నిర్మాణాల ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు మీరాభి, ప్రమీల, సలోమి, విజయనిర్మల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రాధా మాధవి

డిప్యూటీ స్పీకర్ వ్యాఖలను ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి-కొండపి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ వి.శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆర్‌టిసి డిపో సెంటర్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కెజి. మస్తాన్ మాట్లాడుతూ రఘురాం కష్ణంరాజు గతంలో వైసిపి తరపున ఎంపీగా గెలిచినట్లు తెలిపారు. ప్రభుత్వం పోలీసులు చేత కొట్టించడంతో టిడిపి తీర్థం పుచ్చుకొని ఎమ్మెల్యేగా గెలిచి ఊసరవెల్లి రాజకీయాలు చేయడం శోచనీయమని తెలిపారు. చుండి ప్రాంతంలో రఘురాం కష్ణంరాజు ఆధ్వర్యంలో కూల్చిన గుడిసెలను పరిశీలించడానికి వెళ్లిన వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖలు చేసినట్లు తెలిపారు. అక్కడ వందలాది మంది పేదలు అనేక సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. వారికి ముందస్తుగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసుల సహకారంతో బుల్డోజర్‌తో సుమారు 800 గుడిసెలు నేలమట్టం చేశారన్నారు. రఘురాం కష్ణంరాజు ఓ ప్రక్క పేద ప్రజలకు ఇల్లు నిర్మిస్తామని చెప్పి మరో వైపు కూల్చివేయిండం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పూరి గుడిసెల కూల్చివేత సమయంలో పిల్లలు వద్దులు, మహిళలు అనేక ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. ఓ మహిళ చనిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ రాజు ఓ పార్టీ నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శని తెలిపారు. సిపిఐ న్యూ డెమోక్రసీ నాయకులు వై. చంద్రశేఖర్ మాట్లాడుతూ చుండి గ్రామంలో కూలీలు, పేదల గుడిసెలను కూల్చి వేయటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొండపి శాఖ కార్యదర్శి వై. రూబెన్, గడ్డం వందనం, వై బుజ్జి, శివ, జయరాం రెడ్డి, జైరావు, ముంగమూరి బ్రహ్మయ్య, కాలేబు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు



కంప్యూటర్ అందజేస్తున్న కొండవీటి ఏడుకొండలు

కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి - చీమకుర్తి

గెలాక్సీ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండవీటి ఏడుకొండలు చీమకుర్తి మున్సిపల్ కార్యాలయానికి సోమవారం కంప్యూటర్‌ను బహూకరించారు. అదేవిధంగా పొదిలికొండ నరసింహస్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమానికి బియ్యం బస్తాలు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి జవహర్ మాట్లాడుతూ గెలాక్సీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొండవీటి ఏడుకొండలు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. చీమకుర్తి పట్టణంలోని పలు ప్రాంతాలను లయన్స్ క్లబ్ దత్తత తీసుకొని వాటి అభివద్ధికి కషి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రామకష్ణయ్య మాట్లాడుతూ చీమకుర్తి లైన్స్ క్లబ్, గెలాక్సీ లైన్స్ క్లబ్ వివిధ రంగాలలో చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. మున్సిపల్ కార్యాలయానికి గెలాక్సీ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండవీటి ఏడుకొండలు అందజేసిన కంప్యూటర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ చలువాది బదరీ నారాయణ, లయన్స్ మాజీ గవర్నర్ పి.విజయ్ కుమార్ రెడ్డి, ఆర్.లక్ష్మీనారాయణ, గెలాక్సీ లైన్స్ క్లబ్ కార్యదర్శి బొడ్డు ఆంజనేయులు, కోశాధికారి ఆలపాటి నరసింహారావు, లయన్స్ క్లబ్ డైరెక్టర్ చలువాది రమేష్, లయన్స్ ప్రతినిధులు చలువాది జగదీష్, ఎల్లంపల్లి రంగారావు, మొగిలి శెట్టి వెంకటేశ్వర్లు, మద్ది వెంకటరావు, ఎస్‌కె. బాషా, శ్రీహరి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

172 పనులకు అంచనాలు

ప్రజాశక్తి- కొత్తపట్నం

కొత్తపట్నం మండలంలో కొత్తగా రూ.8.27 కోట్ల రూపాయలతో 172 పనులకు అంచనాలు తయారు చేసినట్లు ఎపిఒ నాగరాజు తెలిపారు. అన్ని గ్రామాల్లో పంచాయతీ తీర్మానాలతో అంచనాలు రూపొంది మండల తీర్మానం కోసం ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి దష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. పాదర్తి చెరువు, కొత్తపట్నం అన్న ట్యాంక్, మాలగుంట, పంట కాలువలు, పీడర్ కాలువలు, చెరువు రిపేర్లు, పొలం కంకణాలు తదితర పనులకు నివేదికలు తయారు చేసినట్లు తెలిపారు. ఈ పనులకు ఎంపిపి అంజిరెడ్డి అంగీకారం తెలిపినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉపాధి పనులు నిర్వహిస్తున్న పని ప్రదేశాలలో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి తెలిపినట్లు ఎపిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీకష్ణ , ఎపిఎం నాగరాజు , ఇసి శివకష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

ఆంధ్ర కేసరి యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్‌రావు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులు కృసి చేయాలని, అందుకోసం ప్రతి పౌరుడికి అవగాహన కల్పించాలని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. రాజ మోహన్‌రావు తెలిపారు. స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి - రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త సౌజన్యంతో 'డ్రగ్స్ నియంత్రణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ మోహన్ రావు మాట్లాడుతూ సమాజాన్ని అంటురోగం మాదిరిగా పట్టి పీడిస్తున్న మద్యం మహమ్మారి, డ్రగ్స్ వినియోగం, గంజాయి, సిగిరెట్ వినియోగం వలన కలిగే అనర్థాల గురించి యువతీ యువకులైన విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాటిని వినియోగించడం వల్ల కుటుంబ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతుందో కూడా తెలియ జేయాల్సిన అవసరం ఉందన్నారు. హర్ష ప్రీతం దేవ్ కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ కళాశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. యువత మత్తు పానీయాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో యూన్నివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి : మంత్రి

ప్రజాశక్తి- టంగుటూరు

వేసవిలో తాగునీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో నీటి సరఫరా వివరాలు, సమస్యలను అడిగి మంత్రి తెలుసుకున్నారు. టంగుటూరు, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో పైప్ లైన్ ద్వారా నీటి సరఫరాకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండకూడదన్నారు. నీటి సరఫరాకు ఎక్కడైనా సమస్యలు తలెత్తితే అధికారులు అందుబాటులో ఉండి వెంటనే పరిష్కరించాలన్నారు. పొలాల్లో పశువులకు నీరందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ వేణుగోపాలరావు, టంగుటూరు ఎఇ వెంకటేశ్వరరావు, జరుగుమల్లి ఎఇ జాన్ పాల్‌రాజ్, కొండపి ఎఇ కిషోర్‌బాబు, మర్రిపూడి ఎఇ పాల్, పొన్నలూరు ఎఇ మహేంద్రం పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేత

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని వెన్నూరు రైతు సేవ కేంద్రంలో ఏపీ ఆగ్రోస్ వారి సహకారంతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఎస్ఎంఎఎం 2025-26 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ పనిముట్లను రైతులకు ఎఒ డి.విజయ్ కుమార్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎంఏఎం పథకం ద్వారా మండలానికి తొమ్మిది చెక్కల గొర్రులు 19 మంజూరైనట్లు తెలిపారు. 15 గొర్రులను జనరల్ కేటగిరీకి, నాలుగు గొర్రులను ఎస్‌సిలకు కేటాయించినట్లు తెలిపారు.కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య,గ్రామ వ్యవసాయ సహాయకుడు జె. కొండలరావు,రైతులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

అనసూర్యమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

సిపిఎం జిల్లా కార్యాలయం (సుందరయ్య భవన్) పూర్వ కార్యదర్శి ఈమని నాగేశ్వరావు తల్లి అనసూర్యమ్మ ఇటీవల మృతిచెందారు. ఆమె దశదిన కర్మ మద్దిపాడు మండలం గుండ్లాపల్లి పంచాయతీ పరిధిలోని గార్లపాడులో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, సిపిఎం సీనియర్ నాయకులు వై.సిద్ధయ్య, జాలా అంజయ్య,పెంట్యాల హనుమంతరావు, జిల్లా కమిటీ సభ్యులు బి.రఘురామ్,సి హెచ్.వినోద్ పాల్గొని అనసూర్యమ్మ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.



విద్యార్థిని ని అభినందిస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ఫైనల్ ఇయర్ చదువుతున్న పెరుమాల జ్ఞాన ప్రసూన కావ్యశ్రీ బెంగళూరుకు చెందిన ఈ కామర్స్ సంస్థ మీషో కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీరుగా రూ.22 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకి గ్రామానికి చెందిన పెరుమాల జ్ఞాన ప్రసూన కావ్య శ్రీ రూ. 22 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జ్ఞాన ప్రసూన కావ్య శ్రీని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవీకే. మూర్తి, కళాశాల డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ కె. రూప అక్కేష్,కళాశాల అడ్మిషన్ డైరెక్టర్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ వీరాంజనేయులు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ సివి.సుబ్బారావు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ గిరిబాబు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణపై అవగాహన

ప్రజాశక్తి-టంగుటూరు

మట్టినమూనా పరీక్షలతో రైతులతో ప్రయోజనమని ఎఒ యుంగధర్‌రెడ్డి తెలిపారు. జరుగుమల్లి మండల వ్యవసాయ శాఖ కార్యాలయం నందు మట్టి నమూనాల సేకరణపై వ్యవసాయ శాఖ అధికారులకు, గ్రామ సహాయకులకు మరియు రైతులకు సోమవారం శిక్షణ అవగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు తమ పొలంలోని పోషక విలువలు తెలుసుకొని పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పంటకు కావాల్సిన పోషకాలు, ఎరువులు తగిన మోతాదులో వినియోగించడం ద్వారా తక్కువ ఖర్చు తో ఎక్కువ పంట దిగుబడి పొందవచ్చని తెలిపారు. ప్రతి రైతూ రైతుసేవా కేంద్రంలో మట్టి నమూనాల పరీక్ష యాప్‌లో అప్‌గ్రేడ్ చేయాలన్నారు. అనంతరం పొలంలో రైతుతో పాటు నమూనా తీసే ప్రదేశాన్ని ఫోటో తీయాలని సూచించారు. గ్రామ స్థాయిలో గ్రామ సహాయకులు పాటించవలసిన నియమాల గురించి పలు విషయాలను వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

రూ.2.30 లక్షల విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖ మండప నిర్మాణానికి పట్టణానికి చెందిన ఊటుకూరి కృష్ణ శుభాన్, ప్రసన్న రాజ్యలక్ష్మి దంపతులు రూ.2.30 లక్షలు దేవస్థానం సహాయ కమిషనర్, ఇఒ మదమంచి తిమ్మనాయుడుకు చెక్కు రూపంలో అందించారు. దేవస్థానం అధికారులు తగు రసీదును వారికి అందించారు. కార్యక్రమంలో అర్చకులు కిషోర్ పాల్గొన్నారు.

అద్దంకి : మే 14నుండి 19వరకు ప్రసన్నాంజనేయ స్వామికి మహాకుంభాభిషేకం జరుగుతున్న క్రమంలో ఆహ్వాన పత్రికలను భక్తులు, పుర ప్రముఖులు, దాతలు, నాయకులను ఆహ్వానించేందుకు మహిళా సంఘాలు, సేవా తత్పరులు, మహిళా భక్తులు చిరునామాలు నింపేందుకు 15 మంది ఆ పనిలో నిమగ్నం అయినట్లు ఇఒ మదమంచి తిమ్మనాయుడు తెలిపారు.



నూతలపాడులో చలివేంద్రం ప్రారంభిస్తున్నరోటరీ సభ్యులు

తిరునాళ్ల వద్ద చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని నూతలపాడులోని పోలేరమ్మ గుడి వద్ద తిరునాళ్ల సందర్భంగా వచ్చే భక్తుల కోసం ప్రతి సంవత్సరం లాగానే రోటరీ క్లబ్, సపోర్ట్ సంస్థ సహకారంతో భక్తులకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన విన్నకోట రవికుమార్ చలింవేంద్రాన్ని ప్రారంభించారు. పోలూరి శివారెడ్డి, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు తోకల కృష్ణమోహన్, కోమటి ఆంజనేయులు, సపోర్ట్ అధ్యక్ష, కార్యదర్శులు నాగబైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, భవనం రాజగోపాలరెడ్డి పాల్గొన్నారు.

పర్చూరు : మండలంలోని నూతలపాడులో వేంచేసి ఉన్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరుణాల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు సౌకర్యాలు కల్పించారు. రోటరీ క్లబ్, సపోర్ట్ సంస్థల సభ్యులు భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువుల స్టాల్స్ భక్తులను ఆకట్టుకున్నాయి. తిరుణాల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం ఐదు గంటలకు సిడిమాను రథాన్ని ఏర్పాటు చేయగా చుట్టుపక్కల గ్రామాల భక్తులు ఉత్సాహంగా లాగారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ళలో ఊరేగించారు. కోలాట, భజన సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

ద్విచక్ర వాహనం ధ్వంసం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణం, పరిసర ప్రాంతాల్లో అధిక వేగంతో మట్టి తరలింపు టిప్పర్లు ప్రయాణం చేస్తున్నాయి. లారీ ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి ఢీకొన్న ఘటనలో ఇరువురు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం మండలంలోని ధర్మవరం పెట్రోల్ బంకు సమీపంలో చోటు చేసుకుంది. ఘటనలో శంఖవరప్పాడుకు చెందిన కొప్పుల సంజీవ్ కుమార్, కొప్పుల రేవంత్‌లకు గాయాలు కాగా స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. క్షతగాత్రులను వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఇరువురు యువకులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు ఉపాధి చూపుతున్న తాటిముంజలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

వేసవి తాపం నుండి ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్న తాటి ముంజలు గ్రామీణ పేదలకు ఉపాధిగా మారింది. పెట్టుబడి లేకుండా శ్రమతో పకృతి పరంగా తాటి చెట్టుకు కాసిన కాయలు పక్వానికి వచ్చిన తరువాత చెట్లపై నుంచి కోసి వాటిని పట్టణ ప్రాంతాలకు తెచ్చి అమ్మి ఉపాధి పొందుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో వివిధ గ్రామాల్లో తాటి కర ఉన్న గ్రామీణ ప్రాంతం నుంచి తాటికాయలు కొట్టి వాటిని ఆటల్లో పట్టణ ప్రాంతాలకు తరలించి డజన్లు లెక్క ముంజలు అమ్మి ఉపాధి పొందుతున్నారు. తాటి చెట్లపై ఉన్న కాయలు కొట్టి కింద వేయడం అందరికీ వీలైన పని కాదు. తాటి చెట్లు ఎక్కడంలో నైపుణ్యం ఉన్న యువకులు మాత్రమే చెట్లు ఎక్కి కాయలు, ఆకులు కొట్టగలుగుతారు. అన్ని ఆహార పదార్థాలు కల్తీతో విషపూరితంగా మారిన ప్రస్తుత రోజుల్లో కూడా కల్తీ లేకుండా ఎలాంటి పురుగు మందులు, సంహారక మందులు, రసాయన ఎరువులు వాడకుండా సహజ సిద్ధంగా పండి లభించే ఆహారంగా తాటి ముంజలు ఉన్నాయని ఇప్పటికీ చెప్పుకోవచ్చు. పోషకాలు, నీరు కలిగిన తాటి ముంజలు వేసవిలో వడదెబ్బకు సేద తీరటానికి మంచి ఆరోగ్యకరమైన పదార్థం. చిన్న పిల్లల నుంచి యువతీ, యువకులు, నడివయసు నుంచి పండు ముసలి వరకు తాటి ముంజ తప్పనిసరిగా ఇష్టపడతారు. నాలుగు దశాబ్దాల క్రితం చూస్తే వ్యవసాయం యాంత్రికరణ అవ్వకముందు పొలాల్లోనే పశువుల మేతకు వెళ్లిన సమయంలో పలువురు రైతులు తాటి కాయలు కొట్టి వాటి ముంజలు తెచ్చి పిల్లలకు ఇచ్చేవారు. పొలం పోలేని పొరుగు వారికి కూడా తాటి ముంజలు, కాయలు ఇచ్చేవారు. అయితే మారిన కాలంలో అవి కూడా ఓ వ్యాపార వస్తువుగా మారిపోయాయి. పేదవాళ్లకు ఉపాధి ఇస్తుంది. గ్రామాల్లో పొలాలు, వాగుల గట్లపై ఈ చెట్లను పెంచుతూ ఉంటారు. గతంతో పోలిస్తే ప్రస్తుత తాటి చెట్లు తగ్గిపోయాయి.



ముంజలు అమ్ముతున్న కోలలపూడి గ్రామ దంపతులు

ఆంధ్రుల కల్పవృక్షం తాటిచెట్టు

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తాటి చెట్టుకు ఒక ప్రత్యేకత ఉంది. ఆ చెట్టులో ఏ ఒక్క భాగం వృధాగా పోదు. మన తెలుగువారి విషయానికి వచ్చేసరికి ఆంధ్రుల కల్పవృక్షం తాటి చెట్టు అన్న నానుడి ఉంది. తాటి చెట్టులో ఏ భాగం తీసుకున్న పనికిరాకుండా ఉండదు. తాటి ముదుళ్ళు ఇంటికూసాలుగా, వాసాలుగా, కప్పు బద్దలుగా ఉపయోగిస్తారు. ప్రధానంగా వేసవిలో సేద తీరటానికి తాటి ఆకుతో కప్పు చలువ పందిళ్ళు వేస్తూ ఉంటారు. తాటి కల్లు చాట పరంగా వ్యాపారం. పొడుగైన తాటి మట్టలను నానబెట్టి తాటినార తీసి దానిని తాళ్లుగా ఉపయోగించుకోవచ్చు. తాటి మట్టలతో చీపుర్లు, తాటి ఆకులు, ఈనెలతో లోకుదుళ్ళు రకాల బుట్టలు, తాటి ముదుళ్లను వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరాకు ఉపయోగపడే చిన్న తూములుగా, కాల్వపై ఇరువైపులకు నడవడానికి అమర్చుకోవచ్చు. తాటి సిళ్ళు కాల్చి బొగ్గు చేసి వాటిని దీపావళి ముందులో కలిపి వాడేవారు. తాటి ముంజలు తీసిన బుర్రలను పిల్లలు ఆడుకునే బళ్ళుగా, వంట చెరుకుగా ఇలా చెప్పుకుంటూ పోతే తాటి చెట్లలో ఉపయోగపడని భాగం అంటూ లేదు. రెండవ రకం వస్తువు ఏదీ లేకుండా ఒక్క తాటి వస్తువులతోనే ఇంటి నిర్మాణాన్ని పూర్తిగా చేసుకోవచ్చు.

బీసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

యాదవ సంక్షేమ సంస్థ చైర్మన్ జి నరసింహ యాదవ్

ప్రజాశక్తి - చీరాల

బీసీలు, యాదవుల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా ఎన్డీఎ ప్రభుత్వం పని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ యాదవ కార్పొరేషన్ చైర్మన్ గోళ్ళ నరసింహ యాదవ్ అన్నారు. స్థానిక తెలుగుదేశం కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మంగళవారం మాట్లాడారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో బీసీ కులాలు, యాదవుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర చరిత్రలో మరో సువర్ణాధ్యాయానికి అమరావతి వేదిక కానుందని అన్నారు. మే 2న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణ పనులు పునఃప్రారంభం కానున్నాయని అన్నారు. అమరావతి రాజధాని పునర్నిర్మాణ మహోత్సవంలో అందరు హాజరై విజయవంతం చేయాలని అన్నారు. బీసీలకు టిడిపి రక్షణ కవచంగా ఉందని అన్నారు. ఆ వర్గాలకు గుర్తింపు తెచ్చింది అప్పుడు ఎన్టీ రామారావు అయితే ప్రస్తుతం సీఎం చంద్రబాబు అన్ని రంగాల్లో ప్రాధాన్యమిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు బీసీలకు ప్రాధాన్యమిస్తున్నారని ప్రస్తుతం



మాట్లాడుతున్న చైర్మన్ జి నరసింహ యాదవ్

ప్రభుత్వంలో 8 మంది బీసీ మంత్రులు ఉన్నారని అన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు బడ్జెట్లో బీసీలకు రూ.876 కోట్ల కేటాయించడం హర్షనీయమని అన్నారు. వెనుకబడిన వర్గాల జీవితాల్లో వెలుగు నింపేందుకు కుల వృత్తులను అభివృద్ధి చేయడానికి ఆదరణ పథకం ద్వారా ఆదుకోవడానికి రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. 2025 - 26లో కూడా ఎన్డీఎ ప్రభుత్వం బీసీలు, యాదవుల జీవితాల్లో వెలుగు నింపేందుకు గణనీయమైన నిధులు కేటాయించిందని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధనరావు, పాపాయిపాలెం అధ్యక్షులు వెంకటరావు, అక్కయ్యపాలెం అధ్యక్షులు రాముడు, చీరాల నగర్ సోమయ్య, బాలాజీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రేపల్లె

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గణేష్ ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. పట్టణంలోని 18వ వార్డుకు చెందిన కారుమూరి శ్రీనివాసరావు ఇల్లు అగ్నిప్రమాదంకు గురైనదని తెలుసుకొని వైసిపి మహిళా నాయకులు చందోలు నాగలక్ష్మి కుమారి, ఆర్టిఐ అధ్యక్షురాలు వీసం నాగలక్ష్మి, సజ్జా పద్మావతి, కౌన్సిలర్లు నాగలక్ష్మి, శారదా, సుజాత టీచర్ సహకారంతో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం,



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

బియ్యం, నిత్యవసర సరుకులు, దుప్పట్లు, చీరలు, కూరగాయలు అందజేశారు.

ఎమ్మెల్యేకు సర్పంచి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - కారంచేడు

లో వోల్టేజి సమస్య పరిష్కారం కోసం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చేసినందుకు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావుకు నాయుడువారి పాలెం సర్పంచ్ గుమ్మడి సీతా మహాలక్ష్మి రామ్మోహన్రావు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని నాయుడువారిపాలెం గ్రామంలో ఒక ట్రాన్స్‌ఫార్మరే ఉండటం వల్ల తగిన సరఫరా లేక లోవోల్టేజ్ సమస్యతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో సమస్య గురించి సర్పంచ్ గుమ్మడి సీత మహాలక్ష్మి రామ్మోహన్ ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సత్వరమే సమస్య పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు మరొక ట్రాన్స్‌ఫార్మర్ బిగించి సమస్య పరిష్కరిస్తున్నట్లు సర్పంచ్ గుమ్మడి సీతామహాలక్ష్మి రామ్మోహన్రావు ప్రజాశక్తి తెలిపారు. గ్రామంలో లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



దుకాణంలో వివరాలు అడుగుతున్న అశోక్ బాబు

'మద్యం ప్రదేశ్'గా మార్చిన ప్రభుత్వం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని మద్యం ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చిందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఇన్చార్జి వరికుటి అశోక్ బాబు ఆరోపించారు. అక్రమంగా నడుపుతున్న మద్యం షాపులను ఆయన మంగళవారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ మోసపూరిత విధానాలను ఆయన బహిర్గతం చేశారు. భట్టిప్రోలులో అనుమతి లేని బార్లతో యధేచ్ఛగా ఒక ఖచ్చితమైన సమయం పాటించకుండా ఎనీ టైం మద్యం దొరికేలా రాష్ట్రాన్ని మద్యంఆదప్రదేశ్‌గా తీర్చిదిద్దుతున్న వైనాన్ని కళ్ళకు కట్టినట్లు స్వయంగా తానే మద్యం షాపుకెళ్లి మద్యం కొనుగోలు చేశారు. ధరల్లో తేడాలు తెలుసుకునేందుకు స్వయంగా మద్యం కొని ఎటువంటి అనుమతులు లేకుండా సిటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేసి మందు బాబుల జేబుకు చిల్లులు పెడుతున్న మోసాలను ప్రజలకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన లేకుండా మద్యం విక్రయాలు చేస్తున్నారని తప్పు పట్టారు. బస్టాండ్ సెంటర్లో నిరంతరం ప్రయాణికులు తిరుగుతూ ఉంటారని, మహిళలు వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు కోసం వేచి ఉంటూండగా మద్యం తాగిన మందు బాబుల ఆగడాలకు మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



తాబేళు పిల్లల్ని సముద్రంలోకి వదులుతున్న దృశ్యం

సముద్రంలోకి తాబేళ్ల పిల్లలు

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని రామాపురం సముద్ర తీరంలో అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్, ఐటీసీ బంగారు భవిష్యత్తు ద్వార ఏర్పాటు చేసిన సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం నుండి అటవీ శాఖ జిల్లా అధికారి ఎల్ భీమయ్య 45 తాబేళు పిల్లలను సురక్షితంగా మంగళవారం సముద్రంలోకి వదిలారు. ఆలివ్ రెడ్లి తాబేళ్లు అంతరించే దశలో ఉండగా అటవీ శాఖ సంరక్షించే కార్యక్రమం 2017 నుంచి చేపట్టిందని తెలిపారు. జిల్లాలో ఆరు సముద్ర సంరక్షణా కేంద్రాలు నుండి దాదాపు 17వేల గుడ్లు సేకరించి ఇప్పటికీ 15వేల పిల్లలను సురక్షితంగా సముద్రంలోకి వదిలినట్లు తెలిపారు. తాబేళ్ల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన సముద్ర రక్షణ దళ సభ్యులకు మత్య కారులు సహకరించాలని కోరారు. వాటికి భంగం కలిగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శవనం చంద్రారెడ్డి, సున్నపు లక్షయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో భట్టిప్రోలు వెనుకంజ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో మండలం వెనుకబడిందని డ్వామా పిడి విజయలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని మండలాల్లో టార్గెట్‌కు అనుగుణంగా పనులు జరుగుతుండగా భట్టిప్రోలులో మాత్రం ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. అందుకు గల కారణాలపై ఆమె విశ్లేషించారు. పని దినాలు పెరగటానికి ఫాం పాంట్స్ నిర్వహించాల్సి ఉందని, ఆ మేరకు గ్రామానికి 15 చొప్పున తీయించి కూలీలకు పని దినాలు కల్పించాలని అన్నారు. జరిగిన పని దినాలను బట్టి మండలానికి మెటీరియల్ రూపంలో వివిధ పనుల నిర్వహణకు అవకాశం కలుగుతుందని అన్నారు. ఆ మేరకు జాబు కార్డు ఉన్న కూలీలు కూడా పనిలో పాల్గొనే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. మండలానికి కేటాయించిన పని దినాల నిర్వహణపై ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు కార్యాలయం సిబ్బంది కూడా తోడ్పాటు అందించి లక్ష్యం నెరవేరే విధంగా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిడి సువార్త, ఎపిఒ శివపార్వతి, టిఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.



ఉపాధి పనులపై సిబ్బందిని నిలదీస్తున్న పీడీ విజయలక్ష్మి

మహిళల భద్రతకు భరోసా 'శక్తి యాప్'

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం మహిళలు భద్రత కొరకు అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్‌పై మహిళలు అందరికీ అవగాహన అవసరమని సిఐ సుబ్బారావు అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ ఎబిసి ఫ్యాషన్స్‌లో పనిచేస్తున్న మహిళలకు ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు శక్తి యాప్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. శక్తి యాప్ టీంల ఎస్ఐ హరిబాబు మాట్లాడుతూ ఆపద సమయంలో మహిళలు, బాలికలకు ఈ శక్తి యాప్ ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రతి మహిళ, బాలికలు తమ సెల్ఫోన్లో ప్లే స్టోర్ నందు యాప్ డౌన్లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు, ఫోన్ నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112 నెంబర్ ద్వారా ఫిర్యాదు చేస్తే పది నిమిషాల్లో పోలీసులు చేరుకొని సమస్యను, ఆపదను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 100, 112, చైల్డ్‌లైన్ 1098, గృహ హింసా 181, మహిళ వేధింపులు 1091, సైబర్ టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీసలను సంప్రదించి సేవలు సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు.


శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సిఐ సుబ్బారావు


ఏల్చూరులో ఆక్రమణకు గురైన దళితుల స్మశాన భూమి

దళితుల స్మశాన స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన స్మశాన భూమి ఆక్రమణకు గురైంది. 7.60ఎకరాల స్మశాన భూమికి గాను ఆక్రమణలు పోను 75 సెంట్ల భూమి మాత్రమే మిగిలి ఉందని ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. స్మశాన భూమిని ఆక్రమించుకుని ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. కాలనీలో మృతి చెందిన వారిని పూడ్చి పెట్టడానికి స్థలం చాలక ఉన్న స్థలం పిచ్చి, ముండ్ల చెట్లతో దర్శనం ఇస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ కాలనీలో 500 కుటుంబాలు నివశిస్తున్నారు. స్మశాన భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గతంలో స్థానిక అధికారులు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్‌కు పిర్యాదు చేశామని, అయినప్పటికీ స్పందించిన వారు లేరని కాలనీవాసి మందా జాన్ ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం భూమి ఆక్రమణకు గురికాగా మిగిలిన 75సెంట్ల స్థలంలో కూడా చెట్లు పెరిగి ఖననం చేసేందుకు ఇబ్బంది పడాల్సి వస్తుందని కాలనీ వాసులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్మశాన స్థలాన్ని విక్రయించిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. భూమిని తిరిగి తమ కాలనీకి స్వాధీనం చేయాలని కోరారు. స్మశాన స్థలంలో ఉన్న పిచ్చి ముండ్ల చెట్లను తొలగించి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

టిడిపి అధ్యక్షులు గజవల్లిపై పిర్యాదు

ప్రజాశక్తి - చీరాల

మునిసిపల్ కౌన్సిలర్లు ఇటీవల కలెక్టర్ వెంకట మురళిని కలసి చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పై అవిశ్వాసం కోరుతూ ఇచ్చిన తీర్మానాన్ని నిలిపివేయాలని కోరుతూ కలెక్టర్ వెంకట మురళికి గజవల్లి శ్రీనివాసరావు వినతిపత్రాన్ని ఇవ్వడమే కాకుండా శాసన సభ్యులైన ఎంఎం కొండయ్యపై ఆరోపణలు చేస్తున్న టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనుపై కేసు నమోదు చేయాలని దళిత బహుజన పార్టీ ఉమ్మడి ప్రకాశం, బాపట్ల జిల్లాల అధ్యక్షులు ఎస్‌కె జిలాని మంగళవారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శాసన సభ్యునికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అనుమతి తీసుకోకుండా అవిశ్వాసం వద్దని కలెక్టర్‌ను ఎలా కోరారని ప్రశ్నించ్చారు. బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్యేని అగౌరవ పర్చటంగానే తాను భావించి టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శీనుపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు సిఐ సుబ్బారావుకు ఇచ్చిన ఫిర్యాదులో జిలాని పేర్కొన్నారు.

ఐటిఐకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని గూడవల్లి టిఆర్సి ప్రభుత్వ ఐటిఐ కళాశాల నందు 2025 - 26 ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. రెండేళ్ల కోర్సులైన ఎలక్ట్రికల్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్మెన్ సివిల్, ఏడాది కోర్సు మెకానిక్ డీజిల్‌కు మే 24లోగా ఆన్లైన్లో iti.ap.gov.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 10వ తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయించబడతాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 10వ తరగతి మార్కుల జాబితా, కుల, టిసి, ఆధార్, పాస్ ఫోటో, మెయిల్ ఐడి, ఫోన్ నెంబర్లతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరిశీలన చేయించుకోవాలని తెలిపారు. వివరాలకు 7702400570, 9398650408, 9491185900 సంప్రదించాలని తెలిపారు.



మాట్లాడుతున్న శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు

రైతుల త్యాగం వృథా కాలేదు..

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవం, ఆత్మగౌరవ ప్రతీకాని అమరావతి కోసం రైతులు చేసిన త్యాగం వృథా కాలేదని తెలుగుదేశం బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు, శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ప్రధాని మోదీ పర్యటన విజయవంతం కోసం అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన మహెూత్సవం సందర్భంగా తాడికొండలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరిశీలకులుగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి మళ్లీ దొంగలు, ముష్కరులు, సైకోలు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వారికి బుద్ధి చెప్పే విధంగా ప్రధాని మోదీకి స్వాగతం పలకాలని అన్నారు. గత ఐదేళ్లలో జగన్ అమరావతి రాజధాని నిర్మాణ పనులు ఆపివేసి రాష్ట్ర అభివృద్ధి అడ్డుకున్నారని ధ్వజమెత్తారు.


నివాళులర్పిస్తున్న నరేంద్ర వర్మ

అనారోగ్యంతో ఆర్మీ జవాను మృతి

ప్రజాశక్తి - బాపట్ల

సిక్కిం రాష్ట్రంలో ఆర్మీ జవాన్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన మండలంలోని నందిరాజుతోట గ్రామానికి చెందిన కాసాని లక్ష్మణరావు (27) మృదేహానికి శాసన సభ్యులు నరేంద్ర వర్మ మంగళవారం సందర్శించారు. మృతదేశానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతి చెందిన జవాన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు. మృతి చెందిన లక్ష్మణరావుకు భార్య, కుమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు, పలువురు మాజీ సైనికులు ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి అద్దంకి

స్థానిక ఉప ఖజానా కార్యాలయంలో ఉపఖజానా అధికారి, సిబ్బందితో విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. అద్దంకి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అడుసుమిల్లి అనంత కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నిమ్మరాజు నాగేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులు నర్రా గోపాలరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మక్కెన వెంకటేశ్వర్లు, ఇంకొల్లు అధ్యక్షులు కరి కమలేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తగిరస వీరాంజనేయులు, అద్దంకి సభ్యులు పాల్గొన్నారు. పెన్షనర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఉప ఖజానా అధికారి ఇలాంటి సమావేశం ప్రతి నెల ఏర్పాటు చేసి పెన్షనర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

నేడు కిశోర వికాసంపై సమావేశం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కిషోరి వికాసం వేసవి క్యాంపైన్ విధివిధానాలపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు పల్లపట్ల సిడిపిఓ అనసూయ తెలిపారు. ప్రస్తుత వేసవిలో బాల, బాలికలకు నిర్వహించే కిషోరి వికాసం గురించి మహిళ పోలీసులు, ఆశ కార్యకర్తలు, విఓఎలతో సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. ఆరేళ్లు నిండి ప్రీ స్కూల్ పూర్తయిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల్లలో ఒకటో తరగతిలో చేర్చాలని అన్నారు.


విజేత లైన విద్యార్థులతో కోచ్ దివ్య తేజ

మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకాలు

ప్రజాశక్తి - బాపట్ల

కుడో కాం బాబ్ మార్షల్ ఆర్ట్సలో బాపట్ల జిల్లా టీం బంగారు పతకాలు సాధించినట్లు జిల్లా కుడో మార్షల్ ఆర్ట్స్ కోచ్ కె దివ్య తేజ మంగళవారం తెలిపారు. ఎపి కుడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆలూరి శశిధర్ ఆధ్వర్యంలో ఈ నెల 27న అనకాపల్లి జిల్లా పరవాడలో జరిగిన 1వ రాష్ట్ర స్థాయి కుడో పోటీల్లో జిల్లా టీం తరఫున 11 ఏళ్ల విభాగంలో గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన ప్రైవేటు పాఠశాల విద్యార్థులు కె శ్రీషణ్ముఖ, 12 ఏళ్ల విభాగంలో శ్రీకృష్ణ బాపట్ల టీంలో పాల్గొని స్వర్ణ పతకాలు సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 80మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. విజేతలైన విద్యార్థులకు గాజువాక బిజెపి కన్వీనర్ కరణం నర్సింగరావు పతకాలు అందజేసినట్లు తెలిపారు. మే నెలలో పూణేలో జరగనున్న జాతీయ కూడో పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. విజేతలైన విద్యార్థులను కుడో అసోసియేషన్ బాపట్ల విభాగం ఉపాధ్యక్షుడు అడే కిరణ్ కిషోర్, ప్రధాన కార్యదర్శి బి రవిబాబు, కోశాధికారి ఎ అనురాధ అభినందించారు.

బీరువా బహూకరణ

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని దేశాయిపేట పంచాయతీ నీలకంఠపురం అంగన్‌వాడి పాఠశాలకు ఇనుప బీరువ మంగళవారం బహుకరించారు. వృద్ధా శరణాలయం కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎస్ అంజనదేవికి అందజేశారు. ఈ సందర్భంగా శరణాలయం వ్యవస్థాపకులు సత్రం మల్లేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యమే దేశ సంపదని సూచించారు. చిన్న వయసులోని పిల్లలను తల్లుల వలే సంరక్షించే అంగన్‌వాడీ కేంద్రాలకు హితోదిక సహాయం అందించడం ఆనందంగా ఉందని చెప్పారు. అంగనవాడి టీచర్ ఎస్ అంజనాదేవి ఐరన్ బీరువా బహుకరించిన సత్రం మల్లేశ్వర రావు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

తూర్పుతక్కెళ్ళపాడులో వైద్య శిబిరం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడులో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో 180 మందికి బిపి, షుగర్, గుండె, కంటి సమస్యలపై పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ రామాంజనేయులు తెలిపారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధి కలిగిన వారిని ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా తమ హాస్పిటల్‌లో వైద్యం అందిస్తామని తెలిపారు. డాక్టర్ రాణి, పిఆర్ఒ కాలేశా, వైటల్ హెల్త్ కేర్ ఎన్జీఒ ఫౌండర్ సందిపోగు వందనం, రాజేష్, శ్రీ అంకమ్మ డెవలపర్స్ అండ్ కన్స్ట్రక్షన్స్, టిడిపి నాయకులు పచ్చ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు 'ఈ-స్కిల్' శిక్షణ

ప్రజాశక్తి - రేపల్లె

స్కిల్ హబ్ సెంటర్ నందు ఆసక్తిగల నిరుద్యోగ అభ్యర్థుల నుండి వివిధ రకాల శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎబిఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టిసి రవి చంద్రకుమార్ తెలిపారు. ఎపి నైపుణ్యాబివృద్ధి సంస్థ తమ కళాశాల నందు ఏర్పాటు చేసిన ఈ స్కిల్ హబ్ సెంటర్ నందు పరిశ్రమలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎపిఎస్ఎస్డిసి) నుండి సర్టిఫికెట్ జారీ చేసి అర్హతలను బట్టి అభ్యర్థులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. 18 నుండి 35ఏళ్లు కలిగి, ఇంటర్, ఏదైనా డిగ్రీ ఆపైన చదివి పాసైన/ఫెయిలైన స్త్రీ, పురుష అభ్యర్థులు శిక్షణకు అర్హులని తెలిపారు. వెబ్ డెవలపర్, అకౌంట్స్ అసిస్టెంట్ వంటి కోర్సుల్లో మూడు నెలలు శిక్షణ ఉంటుందని తెలిపారు.

https://forms.gle/F6UGfdS3qmJw6rGZ6

Or https://rb.gy/r4anoo నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9347468946 నెంబర్లో సంప్రదించాలని తెలిపారు.

తగ్గుతున్న పొగాకు ధరలు

ప్రజాశక్తి-కొండపి

లోగ్రేడ్ పొగాకు ధరలు రోజు రోజుకు పడిపోతున్నాయ. 2024-25 సీజన్‌కు సంబంధించి పొగాకు వేలాన్ని గత నెల 10న ప్రారంభించారు. వేలం ప్రారంభ రోజు కిలో పొగాకు గరిష్ట ధర రూ 280, కనిష్ట ధర రూ. 260 పలికింది. మూడో రౌండ్ పొగాకు వేలం మధ్య దశకు వచ్చేసరికి కిలో పొగాకు కనిష్ట ధర రూ.219 కి పడిపోయింది. రోజురోజుకు పొగాకు ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పొగాకు కొనుగోలు వ్యాపారులతో మాట్లాడి గిట్టుధరలు కల్పించేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

పొగాకు కిలో కనిష్ట ధర రూ. 219

కొండపి పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకు కనిష్ట ధర రూ. 219 పలికినట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కట్టవారిపాలెం, నర్శింగోలు గ్రామాలకు చెందిన రైతులు 901 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 765 బేళ్లుఅమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 136 బేళ్లను తిరస్కరించారు. వేలంలో 17 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు

టంగుటూరు : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు సరాసరి ధర రూ. 256.55పైసలు పలికినట్లు వేలం నిర్వహణాదికారి అట్లూరి శ్రీనివాసావు తెలిపారు. మండల పరిధిలోని ముప్పవరం, గొర్లమిట్ట, మట్టిపాడు, శివపురం గ్రామాలకు చెందిన రైతులు 671 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 549 బేళ్ల అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 122 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ.211, అత్యల్ప ధర రూ. 256.55 పైసలు పలికింది. వేలంలో 12 కంపెనీలకు చెందిన వ్యాపారులు, రైతులు. వేలం కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమపై టన్నేజీ పిడుగు

- స్లాబ్ రేటు పెంచిన ప్రభుత్వం
- ఆందోళనలో పాలిషింగ్ యూనిట్ల యజమానులు


గ్రానైట్ పాలిషింగ్ యూనిట్

ప్రజాశక్తి-చీమకుర్తి

గ్రానైట్ పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం మరో పిడుగు లాంటి భారం మోపనున్నది. స్లాబ్ సిస్టం రేటును రూ.27 వేల నుంచి రూ.35 వేలకు పెంచనున్నది. ఈ మేరకు ఉత్తర్వులు సిద్ధమయ్యాయి. మరోవైపు గ్రానైట్ కొనుగోలు టన్నేజీ పద్ధతిలో తీసుకురావటానికి ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఈ మేరకు సమా చారం అందుకున్న గ్రానైట్ పాలిషింగ్ యూ నిట్ల యజమానులలో అలజడి మొదలైంది.

గత వైసిపి ప్రభుత్వం గ్రానైట్ రాళ్ల కొనుగోలుకు పాలుషింగ్ యూనిట్ల యజమానులు స్లాబ్ పద్ధతిన అనుసరించే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఒక కట్టర్ మిషన్ కు రూ.27,000 వంతున నెలకు ఎన్ని మిషన్లు అయితే అన్ని మిషన్లకు ఆ రేటు ప్రకారం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. దీనికి బదులుగా ఒక కట్టర్ మిషన్‌కు క్వారీ యజమానులు 22 మీటర్లకు బిల్లు పాలిషింగ్ యూనిట్ల యజమానులకు ఇస్తారు. మీటరు వచ్చి 350 అడుగుల ఫినిషింగ్ మెటీరియల్‌కు సమానం. ఈ సిస్టం వల్ల పాలుషింగ్ యూనిట్ల యజమానులు గ్రానైట్ కొనుగోలుతో పాటు బిల్లులు కూడా పొందే అవకాశం ఏర్పడింది. అయితే కూటమి ప్రభుత్వం ఒక కట్టర్ మిషన్ కు రూ.27,000 నుంచి రూ 35 వేల రూపాయలకు పెంచుతుంది. దీనివల్ల కట్టర్ కు రూ.8 వేల యజమానులు అదనంగా ప్రభుత్వానికి కట్టాల్సి వస్తుంది. మూలిగే నక్కపై తాటికాయ పడిటనట్లు యజమానులు అల్లాడుతుంటే ప్రభుత్వం స్లాబ్ రేట్లు పెంచడం వారికి నిద్ర పట్టడం లేదు. రాళ్ల కొనుగోలు టన్నేజీ ప్రకారం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు సిద్ధం చేస్తుంది. ఈ సమాచారం అధికారుల ద్వారా తెలుసుకున్న గ్రానైట్ కంపెనీల యజమానులు నానా హైరానా పడుతున్నారు. ఈపాటికి ఈ సిస్టం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అమలులో ఉంది. దీని వల్ల యజమానులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం క్వారీ నుంచి డ్రెస్సింగ్ చేసిన ముడిరాయిని పాలిసింగ్ యూనిట్ యజమానులు మీటర్ల రూపంలో కొనుగోలు చేస్తున్నారు. అందువల్ల యజ మానులకు కొంతమేర మంచి ముడిరాయి దొరికే అవకాశం ఉండేది. టన్నేజీ సిస్టం అమలులోకి వస్తే ముడిగాయి ఎలాటి ఆకారంలో ఉన్న, వంకర టింకర్లుగా ఉన్న టన్నుల ప్రకారం ప్రభుత్వానికి సుంకం చెల్లించాల్సి వస్తుంది. గెలాక్సీ గ్రానైట్ ముడి రాయి బరువు చాలా ఎక్కువ. ఈ పద్ధతి రాజస్థాన్‌లో అమలులో ఉంది. అక్కడ టన్నుకు రూ. 400 ప్రభుత్వాన్ని చెల్లించాల్సి ఉంటుంది. మన రాష్ట్రంలో ఈ పద్ధతి అమల్లోకి వస్తే టన్నుకు రూ.1,600 చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు. దీంతో యజమానులు టన్నేజీ వల్ల తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.ఓటు మార్కెట్ లేక గ్రానైట్ పరిశ్రమ కుదేలవుతోంది. మరో వైపు ప్రభుత్వం తీసుకునే స్లాబ్ సిస్టం రేటు పెంపు టన్నేజీ సిస్టం వల్ల మరింత సంక్షోభంలోకి నెట్టబడే అవకాశం ఉంది.

ప్రభుత్వ పెద్దలను కలువనున్న గ్రానైట్ యాజమానులు

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని కోరుతూ గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానులు ప్రభుత్వ పెద్దలను కలవడానికి సిద్ధమవుతున్నారు. స్లాబ్ రేటు పెంపు మరియు టన్నేజీ సిస్టంపై మరో సారి ఆలోశించి పరిశ్రమను ఆదుకోవాలని కోరుతూ యజమానులు గనుల శాఖ మంత్రిని, మైనింగ్ అధికారులను కలిసి తమ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఈ మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్, మార్టూరు ఏరియా, ఒంగోలు ఏరియా, బల్లికురవ ఏరియా, గ్రోత్ సెంటర్ ఏరియాలలోని పాలిషింగ్ యూనిట్ల యజ మానులు ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్లాబ్ సిస్టం రేటు పెంపు, టెన్నేజీ సిస్టంపై చర్చించినట్లు తెలిసింది.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

బాల్య వివాహాల నిర్మూలన బాలికల అక్రమ రవాణా, బాలికలపై అత్యాచారాల నిర్మూల నపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ కె.రాజశేఖర్‌రావు తెలిపారు. ఒంగవోలు మండల పరిషత్ కార్యాలయంలో కిషోర బాలికా వికాసంపై సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా


మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజశేఖరరావు

ఎంపిడిఒ మాట్లాడుతూ ఐసిడిఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు , ఆశా వర్కర్లు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. సిడిపిఒ నాగరాజకుమారి మాటా్లడుతూ బాలికలకు విద్యా , ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి- కొత్తపట్నం

మండల పరిధిలోని గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న గహాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపిడిఒ శ్రీకష్ణ తెలిపారు. అల్లూరు గ్రామంలోని జగనన్న కాలనీ, సొంతగా కట్టుకునే గహాలను సోమ వారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న గహాలకు అదనంగా ఎస్‌టిలకు రూ.75, 000, ఎస్‌సిలకు రూ.50,000 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపిపి లంకపోతు


మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీకృష్ణ

అంజిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గృహాలు మంజూరైన ఇల్లు నిర్మించుకోకుండా ఆగిపోయిన గహాలను వెంటనే పూర్తి చేసుకోవాలని తెలియజేశారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు

ప్రజాశక్తి - ముండ్లమూరు

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వారికి న్యాయం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వేంపాడు గ్రామంలో ఎపి రైతు సంఘం మండల కమిటీ సమావేశం ఎస్.కె. మీరావళి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పమిడి వెంకట్రావు మాట్లా డుతూ మండలంలో ప్రధాన పంటలుగా వరి, మిరప, పొగాకు, మొక్కజొన్న, బొప్పాయి ఉన్నాయన్నారు. రైతులు అధిక పెట్టుబడులు పెట్టి కష్టపడి పండించిన పంట ఇంటికి రాబోయే తరుణంలో మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేక, అకాల వర్షాలు రైతులను నష్టాల ఊబిలో కూరుకు పోయేలా చేస్తున్నాయన్నారు. ప్రైవేటు వ్యాపారులైన జిపిఐ, ఐటిసి కంపెనీ వాళ్ళు ఊరు ఊరు తిరిగి పొగాకు పండించమని, క్వింటా రూ 16 వేలు నుంచి రూ 18 వేలుకు కొంటామని చెప్పి రైతుల చేత పంట సాగు చేయించినట్లు తెలిపారు. పంట చేతికి వచ్చేసరికి కొనుగోలు చేయకుండా అనేక కారణాలు చూపి రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని తెలిపారు. వ్యవసాయాన్ని గాలికి వదిలేసి కార్పొరేట్ దళారులకు అప్పగించారని విమర్శించారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని స్వామినాథన్


మాట్లాడుతున్న పమిడి వెంకట్రావు

సిఫారస్ ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించి, రైతుల వద్ద పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో రుణ విమోచన చట్టం అమలు చేయాల న్నారు. ఒకసారి రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. మిర్చిని క్వింటా 25వేలకు, లోగ్రేడ్ పొగాకును రూ.250కి తగ్గకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన అన్ని పంటలకు ఇన్సూరెన్స్ చేయాలన్నారు. రైతులకు రూ.20 వేల రూపాయలు పెట్టుబడి సాయంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సంఘటితపరిచి ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు పంట ఏడుకొండలు, గంగినేని సత్యం, గాలి వెంకటేశ్వర్లు, వెంకటరామిరెడ్డి, అన్నపురెడ్డి ఆదినారాయణ రెడ్డి, బి. ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.